జలాశయాల్లో నీటి స్థాయిలు

సాధారణ స్థితికి వచ్చే వరకూ జాగ్రత్త వహించాలి

- ప్రతి నష్టాన్ని నమోదు చేయాలి
- ప్రభుత్వ భవనాల నష్టాలను అంచనా వేయాలి
- వరద బాధితులకు రేషన్, నిత్యావసరాల పంపిణీ వెంటనే జరగాలి
-టెలికాన్ఫరెన్స్ లో స్పష్టం చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలోని జలాశయాలన్నిటి లో ఇన్ఫ్లో , అవుట్ ఫ్లో లను పరిశీలిస్తూ ఎక్కడా ఎటువంటి నష్టాలూ జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జలాశయాల్లో నీటి స్థాయిలు సాధారణ స్థితికి వచ్చే

వరకూ పర్యవేక్షించాలని, వచ్చే రెండు రోజులు జాగ్రత్త వహించాలని తెలిపారు. గురువారం ఉదయం కలెక్టర్ తుఫాన్, వరద పరిస్థితి పై జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారీ వర్షాలకు, వరదలకు జరిగిన ప్రతి చిన్న నష్టాన్ని కూడా నమోదు చేయాలనీ , అలాగే నష్టం విలువను కూడా అంచనా వేయాలని తెలిపారు. రహదారులు, విద్యుత్, పంట, పశు నష్టాల తో పాటు ప్రభుత్వ భవనాలైన వసతి గృహాలను , పాఠశాలలను , వైద్య, పశు శాఖల భవనాలను నమోదు చేయాలన్నారు. గురువారం సాయంత్రానికి పూర్తి స్థాయి నివేదికలను అందజేయాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో తుఫాన్ బాధితులైన వారు చేనేత, మత్స్యకార కుటుంబాలు, పునరావాస కేంద్రాల్లో ఉన్నవారు 4949 మంది కార్డు దారులు ఉన్నారని, వారిలో చేనేత, మత్స్యకార వారికీ 50 కేజీ ల చొప్పున బియ్యం , పామ్ ఆయిల్ 1 లీటర్ , చెక్కెర 1 కేజీ , ఉల్లిపాయలు 1 కేజీ బంగాళా దుంపలు 1 కేజీ చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పునరావాస శిబిరాల్లో ఉన్న వారికీ 25 కేజీ ల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసరాల వస్తువులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సరుకులు వెంటనే అందేలా తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుఫాను బాధితులకు ఆర్థిక సాయం

ఎమ్మార్వో కూర్మనాధరావు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : మొంథా తుఫాను ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయాన్ని కూటమి ప్రభుత్వం అందజేసింది. దాసన్నపేట ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాలలో 30 మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించింది. వారికి గురువారం ఎమ్మార్వో కూర్మనాధరావు ,తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా రవి, విజయనగరం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కర్రోతు నర్సింగరావు ఆధ్వర్యంలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా. ఎమ్మార్వో కూర్మనాధరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిరాశ్రయులకు రేషన్, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలు మేరకు విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని, ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయనగరం మండలం అంతా నిరంతరం పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు

వర్షాల ప్రభావాన్ని పరిశీలించిన కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-రేగిడి ఆమదాల వలస-(విజయనగరం): మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాల ప్రభావాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన గురువారం రాజాం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపారు. రహదారులను, పంట పొలాలను, నీటి ప్రవాహాలను పరిశీలించారు. రేగిడి ఆమదాలవలస మండలం సంకిలి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నదిని పరిశీలించారు. నది ప్రవాహం, దిగువనున్న ప్రాంతాలు, పంట పొలాల పరిస్థితిని తెలుసుకున్నారు. నష్ట నివారణా చర్యలు తీసుకోవాలని, పరివాహక ప్రాంతాల ప్రజలను హెచ్చరించాలని కలెక్టర్ ఆదేశించారు. రాజాం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ పర్యటనలో ఆర్డీవో జీవి సత్యవాణి, తహసీల్దార్ కృష్ణ లత , ఇతర రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ లో నిరాశ్రయుల ఆకలి తీరుస్తున్న ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మొంథా తుఫాన్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తమైన వేళ నిరాశ్రయులకు శృంగవరపుకోట మండలానికి చెందిన ఉపాధ్యాయులు కాపు సోంపురం పాఠశాల లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో పిల్లలకు బిస్కెట్స్ మరియు తిను బండారాలు పంపిణీ చేశారు. అలగే కాపు సోంపురం ,మూల బోడ్డవర , మెట్టపాలెం ,రాయ పాలెం లలోఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సుమారు 90 కుటుంబాలకు ఉల్లిపాయలు, మిరప కాయలు బంగాళాదుంపలు మొదలగు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన శృంగవరపు కోట ఉపాధ్యాయులు ఇందుకూరి అశోక్ రాజు , కె మోహన్ రాజు తంగుడు కృష్ణ మాష్టారు ,గొల్లు సూరిబాబు తదితరులు ఉపాధ్యాయులు పై సర్వత్ర హర్షద్వానాలు వ్యక్తం చేశారు.

సీతం లోజిఎస్టి సంస్కరణలు, విధాన మార్పులు, సవాళ్లు, అవకాశాలపై వర్క్‌షాప్

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : స్థానికసీతం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ లో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో జిఎస్టి సంస్కరణలు విధాన మార్పులు, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించబడింది. ముఖ్యఅతిథిగా అశిష్ కుమార్ అగర్వాల్ (బి.కాం, ఎఫ్‌సిఏ, డి ఐ ఎస్ ఎ), సీనియర్ భాగస్వామి ం అశిష్ కుమార్ అగర్వాల్ అండ్ కంపెనీ హాజరై, జిఎస్టి వ్యవస్థలో సంభవించిన మార్పులు, సవాళ్లు, వ్యాపారాలపై దాని ప్రభావం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని సమన్వయం చేశారు. ఆమె మాట్లాడు తూ విద్యార్థులు ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న మార్పులను తెలుసుకోవాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి విద్యార్థులు కొత్త విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు.కళాశాల డైరెక్టర్ శ్రీ మజ్జి శశిభూషణరావు ఇలాంటి వర్క్‌షాప్‌లు ప్రాయోగిక జ్ఞానాన్ని అందిస్తాయని తెలిపారు.ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు వర్కషాప్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-లక్కవరపుకోట: వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా జరిగిన భేటీ సమావేశం లో పాల్గొనడం జరిగిందని ఆమె విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆమె తెలుపుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల గురించి వివరిస్తూ , వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నాయకులు కార్యకర్తలు ఎక్కడికి అక్కడ తిప్పి కొట్టాలని జిల్లాలో కూటమి పార్టీల సమన్వయం ఇతర రాజకీయ అంశాలపై చర్చించడం జరిగిందని ముఖ్యంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లో గెలిపి లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పని చేద్దామని మంత్రి తెలిపారని అన్నారు. అలగే తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ప్రమాదం తప్పింది అన్నారు. ఇందుకు విశేషంగా కృషి చేసిన జిల్లా ప్రభుత్వ అధికారులు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు అభినందనలు ఈ సమావేశం లో అభినందనలు తెలిపారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనా, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, రాష్ట్ర తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ టిడిపి ఇన్చార్జి కర్రోతు బంగారు రాజు, ఏమిటి రామ మల్లిక నాయుడు పాల్గొన్నారని తెలిపారు.

తుఫాను బాధితులకు రేషన్ సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-డెంకాడ: మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల పునరావాసం కోసం నెల్లిమర్ల నియోజకవర్గంలో పలు చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి గురువారం డెంకాడ మండలంలోని రఘుమండ, బంటుపల్లి, పెదాడ గ్రామ పంచాయతీల పరిధిలోని పునరావాస కేంద్రంలో తుఫాను బాధితులకు రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూతుఫాను వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలపై అధికారులను మరింత శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. తుఫాను ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే సహాయపథకాలు త్వరగా చేరేలా చర్యలు చేపడతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వైభవాని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు పార్లమెంటరీ ఆర్గనైజేషన్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు రాష్ట్ర నగరాల డైరెక్టర్ సూరిబాబు డెంకాడ మండల పార్టీ ఉపాధ్యక్షులు చిన్నారావు పి. రాజశేఖర్ పి .రామారావు జనసేన నాయకులు పాల శ్రీను పైలాశంకర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సఖి సురక్షలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం శ్రీ కళాభారతి ఆడిటోరియంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అధ్యక్షతన సఖి సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెప్మా సిబ్బందికి వైద్య సేవలు ఆన్లైన్లో అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన ఇ - వైద్య ప్రైవేట్ లిమిటెడ్ వారి ద్వారా డాక్టర్ సురేంద్ర,, డాక్టర్ అల్కిత్, వినీత్, 12 మంది నర్సింగ్ స్టాఫ్, 8 మంది ల్యాబ్ టెక్నీషియన్స్, ఇద్దరు సహాయకులు హాజరై 1000 మంది స్వయం సహాయక సభ్యులకు స్క్రీనింగ్ చేసి, బ్లడ్ శాంపిల్ తీసుకొని వీరికి తదుపరి ఆరోగ్య సేవలు బీమా సౌకర్యం ఆన్లైన్ ద్వారా కల్పించుటకు గాను హెల్త్ క్యాంప్ నిర్వహించారు . స్వయం సహాయక సభ్యులకు వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామయ్యపాలెంను వీడని ముంపు

నీట మునిగిన వందల ఎకరాలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని రామయ్య పాలెం తుఫాను ప్రభావంతో పూర్తిగా నీట మునిగింది. వందల ఎకరాల వరి పంటలు నీటిలో మునిగి పోయాయి. పచ్చని చేలతో ఉన్న ఈప్రాంతాలు అన్నీ నేడు చెరువును తలపిస్తు న్నాయి. చేతికందిన పంట ఏమవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా వరిపంట నీటిలో ఉండడంతో తెగుళ్ళ బారిన పడుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ తగిన సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే జామి నుంచి అలమండ సంతకు వెళ్ళే రహదారి రామయ్యపాలెం వద్ద నీటిలో మునిగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముంపుకు గురైన ప్రాంతాలను రాష్ట్ర కొప్పులవెలమకార్పోరేషన్ డైరక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి సందర్శించి రైతులను ఓదార్చారు. పంట నష్టం జరిగితే ప్రభుత్వ పరంగా పరిహారం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారితో మాట్లాడి రామయ్యపాలెం రైతులకు సంభందించి వరి పంట నష్టాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాలని కోరారు.

తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు

విశాలాంధ్ర -మెరకముడిదాం: మండలంలో గర్భాం పంచాయితీకి చెందిన రెండు తుఫాన్ బాధిత కుటుంబాలకు గురువారం బైరిపురం పునరావాస కేంద్రంలో నిత్యవసర సరుకులు పౌర సరఫరా ద్వారా అందించినట్లు మండల రెవెన్యూ తాహసిల్దార్ ఆకుల సులోచన రాణి తెలిపారు. ఈ రెండు కుటుంబాల ఇల్లు తుఫాను కారణంగా నేలమట్టమవడంతో వీరిని బైరిపురంలో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రానికి తరలించడం జరిగింది. ఒక కు కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కేజీ బంగాళదుంపలు, 1కేజీ కందిపప్పు వంటి నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తాడ్డి శ్రీధర్, కెంగువ ధనంజయ, కెంగువ నరసింహమూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, తాడ్డి అప్పలనాయుడు, వీఆర్ఏ గర్భాపు అసరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగావళి నది ఉధృత ప్రవాహంపై కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-రేగిడి: మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా మడ్డువలస డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం విజయనగరం జిల్లా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి రేగిడి మండలం సంకిలి బ్రిడ్జి వద్ద నాగావళి నది ప్రవాహాన్ని పరిశీలించారు.నాగావళి నది పరివాహక ప్రాంత గ్రామాల పరిస్థితిపై ఆయన ఆరాతీశారు. నది తీర ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని విభాగాల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

తుఫాన్ నేపథ్యంలో గంట్యాడలో డిఎస్పి పర్యటన

విశాలంధ్ర -గంట్యాడ: విజయనగరం డిఎస్పి ఆర్ గోవిందరావు విజయనగరం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి లక్ష్మణరావు గంట్యాడ మండలం లో పలు ప్రాంతాలను పర్యటించి మండలంలో పలు వాగులు వాటి ఉధృతి గమనించడం జరిగింది. అనంతరం గంట్యాడ పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది అదే విధంగా గంట్యాడ లక్కిడాం జంక్షన్లో ఆటో డ్రైవర్ల తో రహదారి భద్రత గురించి రహదారి భద్రత నియమాలు గురించి పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ ఎస్సై సాయి కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ ని కలసిన ఎమ్మెల్యే మాధవి

విశాలాంధ్ర-భోగాపురం : నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ను గురు వారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన నాయకత్వం మరింత ప్రభావవంతంగా ఉండాలని నమ్మకం వ్యక్తం చేశారు. అలాగే ప్రజా భద్రత, సేవా నిబద్ధతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అన్ని రకాలుగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మల్లమ్మ చెరువు గట్టు గండిని ఇసుక బస్తాలతో పూడ్చివేత

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం మల్లంపేట మల్లమ్మ చెరువు గట్టు గండి పడింది. గండిని స్థానిక రైతులతో ఇసుక బస్తాలతో తహశీల్దార్ ఎం శ్రీను కప్పి వేయించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-బాడంగి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సత్యనారాయణ ప్రజలను కోరారు. గ్రామంలో ఉన్న కాలువలో బ్లీజింగ్ పౌడర్ గురువారం ఆయన ఆధ్వర్యంలో పిచికారి చేశారు. అదేవిధంగా మంచి నీటి ట్యాంకును కూడా పరిశుభ్రం చేసి బ్లీజింగ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలో ప్రజలు ఎవరు చెత్తా చెందారని వేయవద్దని కోరారు. తాగునీటి వనరులను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జ్యోతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎటువంటి ప్రమాదాలు లేకుండా చూడండి

భీమసింగిలో నీటి ముంపును పరిశీలించిన డిఎస్పి

విశాలాంధ్ర-జామి: తుఫాను కారణంగా పలు ప్రాంతాలు నీటి ముంపులో ఉన్నాయని, ఆయా రహదారులలో ఎటువంటి ప్రమాదాలు లేకుండా చూడాలని విజయనగరం డిఎస్పి గోవిందరావు తన సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని భీమసింగిలో ప్రధాన రహదారి నీటి ముంపులో ఉన్నట్లు తెలుసుకున్న ఆయన స్వయంగా వచ్చి పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక తహశీల్దార్ కృష్ణంరాజుతో కలిసి ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. బస్టాండ్‌లో నీటి తీవ్రతకు గల కారణాలను స్థానిక ఎంపిటిసి ప్రతినిధి దనియాల పైడిరాజు వివరించారు. అలాగే గోస్తనీ నది ఉధృతంగా ప్రవహించడం చూసిన డిఎస్పి నీటి తీవ్రత తగ్గే వరకు ఆయా గ్రామాల రాకపోకలు పునరుద్దరించవద్దని సూచించారు. వర్షపునీటి తీవ్రత కారణంగా రెల్లిపేట వాసులకు ఇబ్బంది కలుగుతోందని తెలుసుకున్న ఆయన పునరావాస కేంద్రానికి వెళ్ళి కాలనీ వాసులతో మాట్లాడి తగు జాగ్రత్తలను తెలియజేసారు. పోలీస్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఎస్ వీరజనార్ధన్‌ను ఆదేశించారు. ప్రధానంగా చాకిరేవు చెరువు కారణంగా ఈపరిస్థితి ఏర్పడినట్లుగా తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడివో ఎస్.అప్పలనాయుడులతో చర్చించారు. చెరువు నీరు వెళ్ళేందుకు ఇబ్బందులు ఉంటే తొలగించాలని రెవెన్యూను కోరారు.

రాజాం మున్సిపాలిటీ -అమ్మవారి, ఆదర్శనగర్ కాలనీ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర-రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారి కాలనీ వద్ద ఉన్న దేవిశ్రీ కళ్యాణ మండపంలో ఎలాంటి కార్యక్రమం జరిగినా, ఆ ప్రాంతం మొత్తం స్థానికులకు సమస్యల వలయంగా మారుతోంది. కార్యక్రమాల సమయంలో కళ్యాణ మండపం పరిసరాల్లో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మరియు ఇతర వాహనాలను పార్క్ చేయడం వల్ల ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఈ రద్దీ కారణంగా అక్కడి నివాసులు మాత్రమే కాకుండా, సమీపంలోని పలు కార్యాలయాలకు వచ్చే, వెళ్లే ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే వాహనాలు వరుసగా నిలిపేయడం వల్ల ప్రజలు నడవడానికి కూడా చోటు లేకుండా పోతోంది. ఇది మాత్రమే కాదు ం రాత్రి వేళల్లో కొంతమంది రోడ్డుపక్కనే మద్యం సేవించడం, అలాగే మద్యం బాటిళ్లు రోడ్డు పక్కనే వేయడం వంటి అసభ్య ప్రవర్తనతో అక్కడి ప్రత్యేకంగా మహిళలు, హాస్టల్లో నివసించే విద్యార్థినిలు భయాందోళనకు గురవుతున్నారు.

దీనిపై స్థానికుల డిమాండ్: రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణ పెంచి, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి "మా సమస్యలను గుర్తించి అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నాం" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తుఫాను బాధితులను టీడీపీ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఆదేశాల మేరకు, 35వ డివిజన్‌లో తుఫాను ప్రభావంతో ఇళ్లు దెబ్బతిన్న బాధితులను టీడీపీ నాయకులు పరామర్శించారు.తుఫాను ప్రభావం వల్ల పొదిలాపు పాపునాయుడు, లావేటి గౌరీ, గ్రంథం లక్ష్మి ఇళ్లు కూలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న అనంతరం విజయనగరం నగర టీడీపీ అధ్యక్షులు గంటా రవి కోదండరాం, ఖాదర్ , పైల మహేష్ , పోల్నేటి మహేష్ బాధితుల ఇళ్లను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మరియు ప్రజా ప్రతినిధులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానికులు ఈ సందర్భంలో శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మికి మరియు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైక్ పగిలింది... సభ ముగిసింది...!

రసాభాసగా మారిన పూసపాటిరేగ సర్వసభ్య సమావేశం

అధికారుల అసమర్థతపై మండిపడ్డ సర్పంచులు

విశాలాంధ్ర-పూసపాటిరేగ: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం ప్రారంభమై మధ్యలో రసాభాసకు దారితీసింది. సభ్యుల మధ్య కేకలు, అరుపులు, ఆరోపణలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభ కొనసాగుతుండగా ఒక గ్రామ సర్పంచ్ ఆవేశంతో చేతిలో ఉన్న వైర్లెస్ మైక్ నేలకేసి కొట్టడంతో పరిస్థితి నియంత్రణ తప్పింది. దీంతో అధ్యక్షురాలు మహంతి కళ్యాణి సభను అర్ధాంతరంగా ముగిసిందని ప్రకటించి సభ్యులతో కలిసి బయలుదేరిపోయింది. ఎంపీడీవో రాధిక సెలవులో ఉండటంతో మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఈవో పీఆర్డీ సమక్షంలో సభ జరిగింది. కొందరు అధికారులు హాజరుకాకపోవడం సభ్యుల ఆగ్రహానికి కారణమైంది. ప్రారంభంలో కొన్ని విభాగాలు తమ పనులను వివరించగా, అధ్యక్షురాలు సభ ముగించదలచిన వేళ ఉపాధి పథకంపై చర్చ జరగాలని సభ్యులు కోరడంతో సమావేశం మళ్లీ కొనసాగింది.కొవ్వాడ గ్రామంలోని దహనశాల కూల్చివేతపై ఎంపీటీసీ పతివాడ తమ్మినాయుడు ప్రశ్నించగా అధికారులు అస్పష్ట సమాధానం ఇచ్చారు. దీనిపై సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఈ క్రమంలో కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు సమాధానం ఇవ్వడానికి లేచినప్పుడు అధికారులు, మిగిలిన సభ్యులు అడ్డుకోవడంతో వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. సర్పంచ్ ఆవేశంతో మైక్ నేలకేసి కొట్టడంతో సమావేశం రసాభాసగా మారింది."మేము మాట్లాడుతుండగా సభను ఎలా ముగిస్తారు? ఇది అధికారుల సభా లేక వైసీపీ సభా?" అంటూ కోట్ల రఘు తీవ్రంగా స్పందించాడు. వెంపడం సర్పంచ్ పిన్నింటి కుమార్, కందివలస సర్పంచ్ గణేష్ సమావేశ ప్రాంగణంలోనే ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులు వారిని సమాధానపరిచి పంపించారు. గత కొన్నినెలలుగా మండల సర్వసభ్య సమావేశాలు రాజకీయ వాదనలకు వేదికలుగా మారి ప్రజా సమస్యలపై చర్చకు చోటు లేకుండా పోతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రైతుల కలలను ముంచేసిన మోంతా తుఫాన్...

వరి పొలాలు నేలమట్టం -వరి రైతుల్లో ఆవేదన

కౌలు రైతులకు కోలుకోని దెబ్బ

విశాలాంధ్ర-వేపాడ : ప్రకృతి విపత్తుగా వచ్చిన మొంతా తుఫాను వ్యవసాయ రైతుల జీవితాలను వణికించింది. ఆరుగాలాలగా కష్టించి చేమట చిందించి శ్రమించి సాగుచేసిన పంటలు ఒక్క వారంలోనే నీటమునిగి, నేలమట్టమయ్యాయి. కాగా ఈ ఏడాది వరి నారుమళ్లు తయారు నుండి ఉబాలాలు వరకు వాతావరణం అనుకూలించడంతో రైతాంగం ముందుగానే వరి నాట్లు వేశారు. దీంతో వాతావరణం అనుకూలించడంతో వరిపైరు కూడా ఏపుగా పెరిగి రైతుల కళ్ళల్లో ఆనందంతో ఉప్పొంగారు.మండలంలోని వావిలపాడు నల్లబిల్లి, భర్తవానిపాలెం, బక్కునాయుడుపేట,ఆకుల సీతంపేట, సోంపురం, సింగరాయి, ఆతవ, కొండగంగు పూడి,జాకేరు, కరకవలస,గిరిశిఖర మారికతో పాటు మండలంలో అన్ని గ్రామాల్లో వరిపైరు ఏపుగా పెరిగింది.కాగా మొంతా తుఫాన్ ప్రభావానికి మండలంలోని అన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో విస్తారమైన వరి పొలాలు తుఫాను వర్షాలతో పూర్తిగా మునిగిపోయాయి. మండలవ్యాప్తంగా ధాన్యపు మొక్కలు నాశనం కావడంతో రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. "మా కళ్లముందే మా శ్రమ ఫలితం నీటిలో కలిసిపోయింది" అంటూ రైతులు, వాపోతున్నారు.వరి పంటపై పెట్టిన విత్తనాలు, ఎరువులు, మందులు,నీటి ఖర్చులు అన్నీ వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తుఫాను ప్రభావంతో నీరు నిల్వ ఉన్న మదుగులు,చెరువులు కూడా పొంగిపొర్లి పొలాల్లోకి వచ్చి మరింత నష్టం కలిగించాయి. ఎక్కడ చూసినా నీరు,మునిగిన పంటలు, రైతుల ముఖాల్లో కలత ఇదే దృశ్యం మండలమంతా కనిపిస్తోంది. రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ "మన శ్రమ వృథా అయినా, మాకు ఆదరణ ఇవ్వాలి. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేసి నష్టపరిహారం అందించాలి" అని కోరుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే రైతులను పరామర్శించి,పంట నష్టంపై సమగ్ర నివేదిక, రూపొందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.అలాగే కొందరు రైతులు వ్యవసాయ భూములను కౌలుకు తీసుకొని సాగు చేయడంతో వారికి కౌలు కార్డులు గాని వాటి ద్వారా ఏ విధమైన రుణ సదుపాయాలు ప్రభుత్వం పథకాలు కల్పించలేదని, ప్రస్తుతం మొంతా తుఫాను ప్రభావం వల్ల వారు కౌలుకు సాగు చేసిన వ్యవసాయ భూములపై పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయినట్లేనని దీంతో కౌలు రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని రైతులు వాపోతున్నారు.ఏది ఏమైనా మొంతా తుఫాను ప్రభావంతో రైతుల కళ్లలో కన్నీళ్లు నింపగా, వారి జీవితాల్లో మరొక కఠిన పరీక్షగా నిలిచిందని చెప్పక తప్పదు.మరి ప్రభుత్వం వ్యవసాయ రైతులను ఏ నిర్ణయం తీసుకొని ఏ విధంగా ఆదుకొంటుందో వేచి చూడాల్సిందే.

తుఫాను బాధితులకు రేషన్ సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-దెంకాడ: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న కొండరాజుపేట గ్రామంలో తుఫాన్ బాధితులకు గురువారం బడుకొండ ప్రదీప్ నాయుడు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు మరియు నగదు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి తమ్మినాయుడు కొండరాజుపేట గ్రామ సర్పంచ్ ప్రతినిధి సరగడ బంగారు రెడ్డి మోపాడు సర్పంచి ప్రతినిధి బడ్డు కొండ రమేష్ కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.

మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి భారీ గా 8 గేట్లు ఎత్తివేత

24600 వేల క్యూ సెక్కుల నీటిని బయటకు విడుదల

విశాలాంధ్ర - వంగర: మడ్డువలస రిజర్వాయర్ ప్రాజెక్టు ప్రధాన రెగ్యులేటర్ నుంచి ఎనిమిది గేట్లుఎత్తివేసి 24600 వేలక్యూసెక్కులనీటిని(దిగువకి)బయటకువిడుదలచేశారు. ఈ మేరకు మడ్డువలస ప్రాజెక్టు కు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారి నితిన్ కుమార్ వెల్లడించారు. మండలంలో గల మడ్డువలస రిజర్వాయర్ ప్రాజెక్ట్ రెగ్యులేటర్ నుంచి 8 గేట్లను ఎత్తివేసి 24 600క్యూ సెక్కుల నీటిని సువర్ణ నదిలోకి విడుదల చేశారు.బారీగా నీటిని బయటకు నాగావళి నదిలో కివిడుదల చేసినట్లు మడ్డువలస నీటిపారుదల శాఖ అసిటెంట్ ఇంజినీర్ నితిన్ కు మార్ తెలిపారు. గురువారం నాడువారు ప్రాజెక్టును సందర్శించి నీటిమట్టం, వరద ప్రవాహమును పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలకు బొబ్బిలి సాలూరుతోపాటు పైనుంచిపలురకాలుగాసువర్ణముఖీ,వేగావతి నదులు ద్వారా వస్తున్న భారీనీటివల్లపెరుగుతున్ననీటిని బయటకువిడుదల చేసినట్లుపేర్కొన్నారు.పగల 11 గంటలుసమయంలో ఎనిమిది గేట్లు ఎత్తివేసి 24600 వేల క్యూసెక్కుల నీరువిడిచిపెట్టామని స్పష్టం చేశారు.రిజర్వాయర్లో 63 మీటర్లు పై చిలుక నీరు ఉందన్నారు. తుఫాను ప్రభావం, నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో 8 గేట్లు ద్వారా నీరు విడిచి పెట్టడం జరిగిందన్నారు. సువర్ణముఖి వేగవతి నదుల నుంచి సుమారు 22 656 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. తుఫాన్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాత్రి పగలు నీటిపారుదల శాఖ అధికారులు సిబ్బంది ప్రాజెక్టు వద్ద పనిచేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ పరిసర ప్రాంత ప్రజలు తగు జాగ్రత్తలతో ఉండాలని అది కారులు సూచించారు.

జేఎన్టీయూ గురజాడ ను అభివృద్ధి చేయండి

ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ :జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ గా నియమితులైన ఆచార్య వి వి సుబ్బారావు ని ఆయన చాంబర్ లో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన తరపున ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి విశ్వవిద్యాలయ పరిస్థితులను వీ సీ కి వివరిస్తూ, 2007లో ఎక్స్టెన్షన్ సెంటర్ గా ఏర్పడిన జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అనేక ఆటుపోట్లకు గురయిందని, విద్య పరంగా పరిపాలనపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. గతంలో విశ్వవిద్యాలయంలో జరిగిన అనేక అవినీతి అక్రమాలపై ఉత్తరాంధ్ర విద్యార్థి సేన పోరాటం చేసిన విషయాలను గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ఏకైక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇదొక్కటేనని, దీనిని అభివృద్ధి పరచాల్సింది పోయి స్వార్థపూరిత ఆలోచనలతో గత పాలకులు తీసుకున్న అవినీతి నిర్ణయాలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట దిగజారిందన్నారు. ఎంసెట్లో చాలా ఎక్కువ ర్యాంకు వచ్చినవారు యూనివర్సిటీని ఎంచుకునే స్థాయికి విశ్వవిద్యాలయ ప్రతిష్ట దిగజారిందని తెలిపారు. కేవలం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రైవేట్ కాలేజ్ గా ఉంటూ వచ్చిన జేఎన్టీయూ ఇప్పుడు వారి కబంధహస్తాల నుంచి బయటకు రావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఉన్నత స్థానంలో ఉండాల్సిన జెఎన్టియు గురజాడ అధమ స్థానంలో ఉండడం విచారించదగ్గ విషయమని, ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి పేద, బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా అప్పట్లో విశ్వవిద్యాలయం ఏర్పడిందన్నారు.ఆ స్ఫూర్తిని పక్కనపెట్టి స్వార్థ రాజకీయాలకు నెలవైంద ని, తెలియజేస్తూ, ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని విశ్వవిద్యాలయాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తే ప్రతి విద్యార్థి ఉద్యోగస్తుడిగా ఎదుగుతారని, ఈ ప్రాంతం అభివృద్ధికి ఇది చాలా దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా రాజకీయ నాయకుల కబంధహస్తాల లోంచి విముక్తి కలిగించి విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను విన్న వీ సీ సుబ్బారావు స్పందిస్తూ, విశ్వవిద్యాలయ ప్రతిష్ట ను పెంచేందుకు విద్య , పరిపాలనపరంగా అభివృద్ధి పరిచేందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటానని, ఈ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ప్రతి విద్యార్థి కి ఉద్యోగం రావడమే లక్ష్యంగా ప్రయత్నం చేస్తామని , ప్రొఫెసర్లను కీలక స్థానాల్లో ఎంపిక చేసుకుని పాలనపరంగా పారదర్శంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, డాక్టర్ అల్లాడి వీరభద్రరావు, డాక్టర్ దంతేశ్వర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి అధికార సేవలకుసచివాలయ సిబ్బంది సేవలకు అభినందనీయం

విశాలాంధ్ర-గుర్ల:తుఫాన్ ప్రభావం చూపిన మూడురోజులు మండల స్థాయి అధికారులకు, సచివాలయం సిబ్బంది ఉత్తమ సేవలందించారని ఎంపిపి పొట్నూరు ప్రమీల కొనియాడారు.ఇదే స్ఫూర్తితో ముందు ముందు పనిచేయాలని సూచించారు.మండలంలోని రెవెన్యూ, గ్రామీణ పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ శాఖ,వైద్య, తదితర శాఖలకు చెందిన అధికారులు గ్రామాల్లో సచివాల సిబ్బంది తుఫాన్ వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా లేకుండా చర్యలు తీసుకున్నందుకు.ఎంపీపీ ధన్యవాదాలు తెలిపారు.తుఫాన్ సమయంలో గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది చూపిన అంకిత భావాన్ని ఎంపీపీ ప్రశంసించారు

గోపాష్టమి వేడుకలల్లో పాల్గొన్న జడ్పీచైర్ పర్సన్ కుటుంబం

విశాలాంధ్ర- విజయనగరం టౌన్: జిల్లా పరిషత్ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గురువారం ధర్మపురి వద్ద ఉన్న సిరి సహస్ర రైజింగ్ ప్యాలెస్ లో కార్తీక మాస గోపాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ గోపాష్టమి వేడుకలులో పాల్గొని శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.హిందువులకు అత్యంత ప్రీతిపాత్రమైన గోపాష్టమి వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎం డి ఓ ఆర్. రాంబాబు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-తెర్లాం : మండలం లో మండల అధికారి అయినా ఎం డి ఓ ఆర్. రాంబాబు కి తహసీల్దార్ హేమంత్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, కేక్ కట్ చేసి కింద స్థాయి సిబ్బంది తో ఎం డి ఓ కు శుభాకాంక్షలు తెలిపారు. ఇలా ప్రభుత్వ కార్యాలయం లో పుట్టినరోజు వేడుకలు మండల అధికారి అయినా తహసీల్దార్ తెలపడం నాకెంతో ఆనంద దాయకం గా ఉందని ఎం డి ఓ ఆర్ రాంబాబు సంతోషంవ్యక్తం చేశారు

ప్రజలకుమందులపంపిణీచేసినతహసిల్దార్

విశాలాంధ్ర-తెర్లాం : మండలం లో తుఫాన్ ప్రభావం వలన ముంపుకు గురి అయిన గంగన్నపాడు గ్రామం లో శానిటేషన్ లు, ప్రజలకు మందుల పంపిణీ తహసిల్దార్ హేమంత్ కుమార్, మరియు ఎం డి ఓ ఆర్. రాంబాబు వారి ఆదేశాల మేరకు నిర్వహించామన్నారు. గంగన్న పాడు గ్రామ పంచాయతీ లో హ్యాండ్ బోర్స్, ఓపెన్ వెల్స్ సూపర్ క్లోరినేషన్ చేసిన తర్వాత వాటర్ క్వాలిటీ టెస్ట్స్ చేయడం జరిగింది అని ఆ గ్రామ సచివాలయం సిబ్బంది తెలిపారు.

విజయరాంపురంలో ఆడగొర్రెలు దొంగతనం

విశాలాంధ్ర -తెర్లాం: మండలంలో విజయరాంపురంఏబూరిపేట లో వంజరాపు సత్యం గొర్రె ల శాలలో రాత్రి 1:00 గ, 2:00 గ, మధ్యలో 11 ఆడగొర్రెలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించడం బాధాకరం అని ఆ గ్రామ సర్పంచ్ మాధుసూదనరావు విలేకర్ల తో మాట్లాడుతూ తెలిపిన వివరాలు మేరకు ఇటువలా కాలం లో దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్ళు, రైతుల ఇంజన్ లు పలురకాల రైతులకు సంబంధించిన జీవనోపాధి కి దొంగలు గండి కొడుతున్నారు అని అన్నారు. ఇలా అర్ధరాత్రి సమయం లో గొర్రెలు దొంగలించుకు పోతే ఎం చెయ్యాలో తెలియక రైతులు లబోదిబో అంటున్నారు అని సర్పంచ్ విలేకర్ల తో తెలిపారు

ఘనముగామండలపార్టీఅధ్యక్షునిజన్మదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -చీపురుపల్లి: ఈరోజు,చీపురుపల్లి స్థానిక వైస్సార్ సీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు పుట్టినరోజు వేడుకలు పార్టీ కార్యకర్తలు,అభిమానులు, శ్రేయోభిలాషులు,నాయకులు మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముందుగా కార్యకర్తలు,అభిమానులు వరహాలనాయుడు ఇంటి వద్ద నుండి బైక్ ర్యాలీతో ప్రారంభమై కనకమహాలక్ష్మి అమ్మవారిలి కోవెలకు చేరుకుని ఘనంగా పూజలను నిర్వహించారు.అనంతరం పార్టీ కార్యాలయంలో అభిమానులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మూడు రోడ్ల జంక్షన్ వద్ద బాణసంచా కాల్చారు. అనంతరం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు,పండ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లిఇప్పిలి అనంతం ,జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు లివలిరెడ్డి శ్రీనివాస నాయుడు నియోజకవర్గం యువజన అధ్యక్షులుబెల్లాన వంశీకృష్ణ ఎంపీటీసీలు,సర్పంచ్ లు,నాయకులు,కార్యకర్తలు,తదితరులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు

ఎస్సై నవీన్ పడాల్

విశాలాంధ్ర- లక్కవరపుకోట: విశాఖ అరకు ప్రధాన రహదారి గంగూ బాడి, సంతపేట జంక్షన్ గురువారం వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై సిహెచ్ నవీన్ పడాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు బైకులు పై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని తెలిపారు. అలాగే రోడ్డుకి ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలో తొలగించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునే విధంగా ప్రయాణించాలని ఆయన తెలిపారు. సెల్ ఫోను మాట్లాడుకుని ప్రయాణించరాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన వరి పంట పరిశీలన

విశాలాంధ్ర -దెంకాడ: మండల కేంద్రంలోని చొల్లంగిపేట గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు తుఫాను వల్ల పడిపోయిన వరి పంటనుపరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదివరకు వరి పంటకు నష్టపరిహారం క్రింద ఒక హెక్టారు అనగా రెండున్నర ఎకరాల 17,000 రూపాయలు ఇచ్చేవారు ఆ పరిహారాన్ని ప్రభుత్వం ఇప్పుడు 25,000 కు పెంచడం జరిగిందని తెలిపారు. క్షేత్ర సందర్శనం చేసి పంట నష్టం వివరాలను (ఏ పీ ఏ ఐ ఎం ఎస్) యాప్ లో రైతులు వివరాలు నమోదు చెయ్యాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టీ సంగీత ,వ్యవసాయ విస్తరణ అధికారి బి రామకోటి, గ్రామ సర్పంచ్ కోరాడ కనకరాజు మరియు రైతులు పాల్గొన్నారు.

120 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

- డీసీఎంస్. చైర్మన్ గొంప క్రిష్ణ

విశాలాంధ్ర- శృంగవరపుకోట: మండలం లో మొంథా తుఫాను ప్రభావిత కుటుంబాలకు సహాయం తుఫాను కారణంగా దారపర్తి గ్రామంలో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న గిరిజనులకు విజయనగరం జిల్లా డీసీఎంస్ చైర్మన్ గొంప క్రిష్ణ సుమారు 120 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా తుఫాను ప్రభావిత ప్రజలకు కొంత ఉపశమనం కలిగిందని. గ్రామస్థులు గొంప క్రిష్ణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం , మాదిబోయిన మంగరాజు , గనివాడ సన్యాసినాయుడు (వినాయకపల్లి సర్పంచ్), ఇందుకూరి ఇందుకురి శ్రీనిరాజు, అంబటి యస్వంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు రెండు ఆవులు బలి

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో కొత్త కర్ర, గ్రామానికి చెందిన సబ్బి పైడితల్లి సబ్బి రామప్పమ్మ కి చెందిన రెండు ఆవులు గర్భాం రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిలో మేతకు వెళ్లి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు గురై చనిపోవడం జరిగింది అని మండల రెవెన్యూ తహసిల్దార్ ఆకుల సులోచన రాణి తెలిపారు. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్తు సరఫరా నిలుపుదల చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. తాహ సిల్దార్ తో పాటుగా, పశు వైద్యాధికారి సిఆహ్. హైమావతి, విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు బూర్లె నరేష్ కుమార్,తాడ్డి శ్రీధర్, కె. ధనంజయహుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు.

చేనేత కార్మికుల కుటుంబాలకు తుఫాన్ ఆర్థిక సాయం

తాసిల్దార్ వరప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర -బాడంగి: మండలంలో వివిధ గ్రామాల్లో నివసిస్తున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తాసిల్దార్ వరప్రసాద్ తెలియజేశారు. వాడాడ గ్రామంలో ఉన్న 13 కుటుంబాలకు, అదేవిధంగా రామచంద్రపురం గ్రామంలో ఉన్న 23 చేనేత కుటుంబాలకు, ముగడ లో ఉన్న 10 చేనేత కుటుంబాలకు ఈ సహాయాన్ని ప్రభుత్వం అందచేసిందని. ప్రతి కుటుంబానికి 50 కేజీల బియ్యము, కేజీ చొప్పున కందిపప్పు, బంగాళదుంపలు, పంచదార, ఆయిల్ వంటి దినుసులను పంపిణీ చేసామని ఆయన అన్నారు. ఈ ప్రక్రియ గ్రామ పెద్దల అధికారుల సమక్షంలో గురువారం అంద జేశామని తెలిపారు. ఆయా కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ధనం తోపాటు వీఆర్వో లు పాల్గొన్నారు

పశువులకు గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర- దెంకాడ:తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బంటుపల్లి, అక్కివరం గ్రామంలలో గురువారం పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ తరుపున సుమారు 190 పశువులకు గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు వేయడం, అనారోగ్యం బారిన పడిన పశువులకు చికిత్సలు, పాడి రైతులకు తుఫాన్ అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ పొదుపు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : ప్రపంచ పొదుపు దినోత్సవం సందర్భంగా పట్టణంలో, కంటోన్మెంట్ ఏరియాలో ఉన్న గురజాడ పబ్లిక్ స్కూల్లోపొదుపుఅనే అంశం మీద విద్యార్థులకు అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న మదర్ తెరిసా సేవా సంఘం&బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షులుత్యాడ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూపొదుపు అనేది ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు చాలా అవసరమని, భావితరాలవారికి మన ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులు పొదుపు చేయాలన్నారు. నీరు, విద్యుత్తు, ఆహారము, కాలము, ధనం వంటి వాటి మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ ఐదు అంశాల గురించి విద్యార్థులకి వివరిస్తే, వారిలో మార్పు వస్తూ, సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడతారని తెలిపారు. వీరంతా భవిష్యత్తు తరాలవారికి ఒక మార్గదర్శకులుగా ఉంటారని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాడ స్కూల్ హెచ్.ఎం పూడి శేఖర్, సైన్స్ హెచ్.ఓ.డి పి.రమేష్, స్కూల్ ఇన్చార్జ్ బి.పద్మలత, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లెండి లో మూడు రోజుల అంతర్జాతీయ కాన్ఫరెన్స్(ఐక్ డా)-2025 ప్రారంభం

విశాలాంధ్ర -దెంకాడ:లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, విజయనగరం లో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు -ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎల్ ఓ టి), మరియు డేటా అనలిటిక్స్ కాన్ఫరెన్స్లో భాగంగా విభిన్నంగా ఏర్పాటుచేసిన ప్రాజెక్ట్ ఎక్స్పో ఆకట్టుకుంది. ఈ కాన్ఫరెన్స్ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులకు తమ అభిప్రాయాలు పంచుకునేందుకు, మరియు తెలివైన కంప్యూటింగ్ వ్యవస్థల భవిష్యత్తును ఆకారమిచ్చే క్రియాత్మక అభిప్రాయాలు పరిశీలించేందుకు ఉత్తమ వేదికగా నిలిచింది.ప్రారంభ మైన మొదటి రోజున ప్రాజెక్ట్ ఎక్స్పోలో వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు రూపొందించిన అత్యాధునిక నమూనాలు, పరిశోధనల ప్రదర్శనగా నిలిచాయి. ఈ ప్రదర్శనలు కళాత్మకత, సాంకేతిక నైపుణ్యం, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ, డేటా అనలిటిక్స్ను సమర్థవంతంగా అన్వయించడాన్ని చూపించాయి.డాక్టర్ కార్తికేయన్ సమీనాథన్ (హెడ్ - జనరేటివ్ ఏఐ మరియు నాస్కాం బ్రాండ్ అంబాసిడర్) ముఖ్యప్రసంగం చేశారు. తన ప్రేరణాత్మక ఉపన్యాసంలో డాక్టర్ కార్తికేయన్ జనరేటివ్ ఏ వన్, తదితర వినూత్న డిజిటల్ సాంకేతికతలు ఎలా పరిశ్రమలను, విద్యా రంగాన్ని ఆధునికంగా మలుస్తున్నాయో వివరించారు. ఆయన అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ప్రపంచాన్ని అనుసరించి తమ ఆలోచనలు, ప్రాజెక్టులు నిర్వహించేందుకు విద్యార్థులు, పరిశోధకులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వి.వి రామారెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ వి. అంజిరెడ్డి, డా. హరిబాబుతామ్మినేని, అలాగే సీనియర్ అడ్మినిస్ట్రేటర్స్ శ్రీ జి. ప్రకాశ్ బాబు (డీన్-ప్లేస్మెంట్స్), డా. బివిఎస్. ఆచార్యులు (డీన్-ఐ క్యూ ఏ సి), కె.వై. వసంత్ (డీన్-ఐఐసీ), మరియు వివిధ విభాగపు అధిపతులు డా. కె. సుబ్బరామయ్య, డా. సతీష్ పుజారి, డా. రామారావు, డా. రాజేంద్ర, డా. డి. నరేశ్, డా. వి. ప్రసాద్, మిస్టర్ పి.జె. వర్మ, డా. పి.డి. సాయిలజ పాల్గొన్నారు. వారి ఉనికి ఈ కార్యక్రమానికి ప్రత్యేకతనివ్వడమే కాక, పాల్గొన్న విద్యార్థులను అభినందించి, పరిశోధనలో ఆధునికత, క్రియాశీలత పట్ల ఉత్సాహపరిచారు.

శునకాల దాడిలో 18 గొర్రెల మృతి 10 గొర్రెలకు గాయాలు

రూ 2.50 లక్షల పైగా ఆస్తి నష్టం

గాయపడిన గొర్రెలకు వైద్యం అందిస్తున్న పశు వైద్యులు

ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న గొర్రెల కాపర్లు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని రామస్వామి పేట గ్రామానికి చెందిన దుక్క గణేష్, పత్రి గోవింద గొర్రెల కాపరులకు చెందిన గొర్రెల మందపై ఊర కుక్కలు దాడి చేయడం వలన 18 గొర్రెలు మృతి చెందగా మరో 10 గొర్రెలకు గాయాలు పాలు అవ్వగా రెండు గొర్రెలు పరిస్థితి విషమంగా ఉంది.ఇందుకు సంబంధించి గొర్రెలు కాపర్లు అందించిన వివరాల మేరకు గత 5రోజులుగా కురుస్తున్న మొంతా తుఫాను కారణంగా గ్రామానికి సమీపంలో గల ఆనందవనం లేఅవుట్లో గొర్రెలను నిలపగా పక్కనే ఉన్న కొండపైకి మేతకు వెళ్లిన 30 పైగా గొర్రెలు వర్షం కారణంగా బుధవారం రాత్రి కిందకు దిగి రాలేదన్నారు. గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండగా చుట్టుప్రక్కల గ్రామాల్లో గల ఊర కుక్కలు 15కు పైగా మందలా వచ్చి గొర్రెల మందపై దాడి చేసి వాటికి నచ్చిన రీతిలో కొన్నింటిని పీకలో కొరికేయగా మరికొన్నింటిని పొట్టలు చీల్చి పేగులు బయటకు తీసేయడంతో మృతి చెందాయన్నారు.అలాగే మరి 10 గొర్రెలను గాయాల పాలు చేశాయి. కుక్కల దాడిని కనిపెట్టిన గొర్రెలు కాపర్లు వెళ్లేసరికి ఈ ప్రమాదం జరిగి పోయిందని తెలిపారు. సుమారు వీటి విలువ రూ.2.50 లక్షలకు పైగా ఉంటుందని ఇది గొర్రెలు కాపరులకు తీరని ఆర్థిక నష్టమని ఆవేదన చెందుతున్నారు.అలాగే చనిపోయిన18 గొర్రెలను జెసిబి సహాయంతో గొయ్యి తవ్వి పూడ్చి పెట్టారు.కాగా మొంతా తుఫాను కారణంగానే ఈ ప్రమాదంతో పాటు ఘోర విషాదం జరిగిందని కావునా ప్రభుత్వం ఆదుకోవాలని కాపర్లతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.అలాగే బొద్దాం పశువైద్యాధికారి ఎం.అనిల్ కుమార్ సచివాలయ పశు వైద్య అసిస్టెంట్ అధికారి చిన్నాలు గాయాలపాలైన గొర్రెలకు చికిత్స అందించారు.

పి సి అండ్ పి ఎన్ డి టి చట్టం అమలుపై సమీక్ష

విశాలాంధ్ర- చీపురుపల్లి : ఈరోజు చీపురుపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నందు ఏవో ఈశ్వరమ్మ అధ్యక్షతన పి సి అండ్ పి ఎన్ డి టి . చట్టం అమలు పై సమీక్షా సమావేశం నిర్వహించారు.. మీ సమీక్ష సమావేశం లో చీపురుపల్లి డివిజనల్ స్థాయి పి సి అండ్ పి ఎన్ డి టి కమిటి అధికారులు తో సదరు చట్టం అమలుపై తీసుకుంటున్న చర్యలు ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత సంఘంలో నెలకొని ఉన్న పురుష సంతాన ప్రాధాన్యత, ఆడపిల్లల పట్ల వివక్షత, మూఢనమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలిస్తే చాలు గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిపోయింది చర్చించారు. ప్రభుత్వం 0-6 సంవత్సరాలు బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి పి సి అండ్ఎం పి ఎన్ డి టి 1994 (లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ) చట్టం ను కఠినంగా అమలు చేయడం ద్వారా లింగ నిర్ధారిత ఆడ శిశువుల భ్రూణ హత్యలు నిరోధించుటకు ఈ చట్టం ప్రాధాన్యతను ఇస్తుంది అని తెలియజేశారు.అలాగే చీపురుపల్లి డివిజనలో ఏస్కాన్ సెంటర్ వారైన లింగ నిర్ధారణ చర్యలకు పాల్పెడితే వారిపై పి సి అండ్ పి ఎన్ డి టి 1994చట్టము ను అనుసరించి వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని తెలియచేసిరి . ఈ కార్యక్రమం లో చీపురుపల్లి డా. జి . అర్చన స్త్రీ వైద్య నిపుణులు, ఎల్. దామోదర రావు ఎస్ ఐ పోలిస్ శాఖ , డా. జి . రమేష్ చిన్న పిల్లల వైద్య నిపుణులు, హ్యూమన్ రైట్స్ ప్రతినిది వి. పద్మలత ఎన్జీఒ, పి. నాగ మణి గారు సీడీపీఓ , పి.సెసికల సుపెర్వీసర్ ఐ సి డి ఎస్సి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి డెమో చిన్నతల్లి, పవన్ ఆశిష్ మానిటరింగ్ కన్సల్టెంట్ డెమో సెక్షన్ నుండి పాల్గొన్నారు.

పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి

విశాలాంధ్ర-విజయనగరం :నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపటాల్సిందేనని, ఇందుకోసమే ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సిబ్బందికి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం బీసీ కాలనీ, అయ్యన్నపేట, కామాక్షి నగర్, ఉడా కాలనీ, కణపాక ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కాలువలు, రహదారులు, కల్వర్టు పనులను గమనించి తగు సూచనలు చేశారు. అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో తప్పనిసరిగా క్షేత్ర పరిశీలకుడు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజావసరాలను, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న విధానంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలించారు. అన్నక్యాంటీన్లు తనిఖీ చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా వాసులు గాయపడ్డ ఘటనపై స్పందించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర-విజయనగరం : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రాముని దర్శనానికి వెళుతూ వారణాసి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన శ్రీకాకుళం జిల్లాకు చెందిన కోటబొమ్మాళి, బ్రాహ్మణతర్ల, పలాస వాసులకు ప్రమాదం జరగడంపై శ్రీకాకుళం జిల్లా ఇంచార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 16 మంది గాయపడిన నేపథ్యంలో ఈ సంఘటన జరిగిన తీరు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు తదితర అంశాలపై శ్రీకాకుళం, అయోధ్య, జోన్ పూర్ జిల్లాల కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, జోన్ పూర్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో మాట్లాడి వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందేవిధంగా చూడాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుడ్కర్ ను ఎప్పటి కప్పుడు అయోధ్య, జోన్ పూర్ కలెక్టర్లు, అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, క్షతగాత్రులు కోలుకున్న వెంటనే స్వస్థలాలకు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులతో ఫోన్ లో మాట్లాడిన మంత్రి ధైర్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని చెప్పారు. వైద్యులు మంచి వైద్యం అందిస్తారని బరోసాను ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అవసరమైన సహాయం అందిస్తామని, కోలుకున్న వెంటనే స్వస్థలాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. బాధితుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

అవినీతి వరదలో కొట్టుకుపోయిన మారిక రోడ్డు..

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకుడు చల్లా జగన్ డిమాండ్.

విశాలాంధ్ర-వేపాడ : - మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర మారిక గ్రామ ప్రజల కలల రోడ్డు అవినీతి వరదలో కొట్టుకు పోతోంది.ఎన్నో సంవత్సరాలుగా గిరిజన ప్రాంత ప్రజలు ఎదురుచూసిన రవాణా సౌకర్యం ఇప్పటికీ మాయమాటగానే మిగిలిపోయిందని సిపిఎం నాయకుడు చల్లా జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు, ముట్టడులు, వంటావార్పులు చేసిన తరువాతే ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన గుర్తు చేశారు.అయితే మూడు దఫాలుగా నిర్మించిన రోడ్డు ప్రతి వర్షాకాలానికీ వరద నీటికి కొట్టుకుపోతూ, ప్రజల కష్టాలను రెట్టింపు చేస్తోందని అన్నారు.ఇది సాధారణ పొరపాటు కాదు, కాంట్రాక్టర్ %-% ఇంజనీరింగ్ అధికారులు కలిసి అవినీతి గుట్ట కట్టారు.కొద్ది నెలలకే కూలిపోయే రోడ్డు నిర్మాణం ఎలా జరిగిందో నిపుణుల కమిటీతో విచారణ జరపాలని చల్లా జగన్ డిమాండ్ చేశారు.వర్షంతో చెదిరిపోయిన రోడ్డు స్థానంలో వెంటనే కొత్త రోడ్డు నిర్మించి మారిక గిరిజన ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.అలాగే అతుకుల బొంతగా చేసిన పనులపై విచారణ జరిపి,అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చల్లా జగన్ డిమాండ్ చేశారు.ప్రజల కష్టార్జిత నిధులను దోచుకున్నవారిని వదిలిపెట్టమని అవినీతి మీద పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు : మొంథా తుఫాను ప్రభావంతో పునరావాస కేంద్రంలో ఉన్నటువంటి ,దత్తి లో 33, కే కృష్ణాపురం లో ఉన్న 14 కుటుంబాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ హరికిరణ్ చేతులమీదుగా 25 కేజీ లు బియ్యం, ఆయిల్ , కంది పప్పు పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్చార్జిలు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్తిబాబు, బెజవాడ బంగారు నాయుడు, దత్తి నారాయణ అప్పలనాయుడు, సర్పంచులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

salpg సంస్థ సహకారంతో దివ్యంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణి

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో salpg సంస్థ వారి ఆర్థిక సహకారంతో గురువారం 250మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా సలాఫ్గ సంస్థ సీఈఓ రిచా షిండే, రామనాథ్ తదితరులు విచ్చేసారు. వీరు ముందుగా శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ను మరియు ట్రస్ట్ నడిపిస్తున్న వీయూఎంసీ హాస్పిటల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు, దివ్యాంగులకు చేస్తున్న సేవలును కొనియాడారు. ఇలాంటి మంచి పనులు మంచి సేవలు చేయటంలో సహకారం అందించినందుకు salpg సంస్థ వారు తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్ళు, చేతులు, వీల్ చైర్స్, ట్రయి సైకిల్స్,పోలియో కాలిపర్స్, వాకర్స్, చెవిటి మెషిన్స్, అంతేకాకుండా వృద్దులకు బియ్యం, దివ్యాంగులు అందరికి ఉచితంగా వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. అంధులకు నెలవారి పెన్షన్ అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, ట్రస్ట్ వైస్ చైర్మన్ డా. ఫణింద్ర, వీయూఎంసీ హాస్పిటల్ బృందం, ట్రస్ట్ బృందం పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు సమాయత్తం కావాలి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో లోచర్ల గ్రామంలో గురువారం మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చెయ్యవద్దు అని కోటి సంతకాలు సేకరణ భాగంలో సంతకాలు సేకరణ చేయటం జరుగుతుంది ఆ గ్రామ వై సి పి నాయకులు చిన్ననాయుడు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: నియోజక వర్గంలో కొందరు పౌరుల ఆరోగ్య సమస్యలు వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసి, సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు లు చేతులు మీదుగా బొబ్బిలి కోటలో లబ్ధిదారులకు అందజేశారు:బొబ్బిలి పట్టణం, దిబ్బ వీధికి చెందిన నిమ్మాడి లథ కు 30 వేల,786 రూపాయలు, పట్టణం, గొల్లపల్లికి చెందిన సోంబర్కి మనోహర్ కి 30 వేల రూపాయలు,?రామభద్రపురం గ్రామానికి చెందిన తిళ్ళపూడి రాజు కి 30 వేల 900 రూపాయలు, పట్టణం, కోరాడ వీధికి చెందిన ?మండల రమణమ్మ కి 30 వేల 42 రూపాయలు, పట్టణం, తారకరామ కాలనీకి చెందిన ?మడక ప్రసన్న కుమార్ కి 25 వేల 341 రూపాయలు, బాడంగి మండలం రేజేరు గ్రామానికి చెందిన బొమ్మినాయుని సుధారాణి కి 23 వేల,400 రూపాయలు, తెర్లా మండలం నందబలగ గ్రామానికి చెందిన బేత పారినాయుడు కి 27 వేల,810 రూపాయలు,లొల్లరపాడు గ్రామానికి చెందిన తింగలి నీరజ్ కి 19 వేల,850 రూపాయలు, బొబ్బిలి పట్టణం, గొల్లపల్లికి చెందిన ?కాకాల గ్రీష్మ హాసిని కి 39 వేల 500 రూపాయలు తదితరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సభ్యులు కెల్ల చిన్నారావు,ఎం వాసు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయండి :ఎమ్మార్వో కి వినతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మండల పరిధిలోగల కొండమల్లిపూడి గ్రామం లో సిపిఐఎం పార్టీ పర్యటన 20 గిరిజన కుటుంబాలు మొంథా తుఫాన్ కారణంగా నాలుగురోజులుగా కురుస్తున్న వర్షానికి వారు నివాసం ఉంటున్న ఇండ్లు పూర్తిగా కారిపోయి పిల్లాపాపలతో వృద్ధులతో కారుతున్న ఇంట్లోనే నాలుగురోజులుగా పస్తులు ఉంటూ ఇబ్బందులకు గురయ్యారు ఈ విషయాన్ని మల్లిపూడి రెవెన్యూ గ్రామానికి చెందిన వీఆర్వో చోటా కి స్థానిక గిరిజన ప్రజలు వర్షం కారణంగా మా ఇళ్ళలో ఉండలేకపోతున్నాం మాకు ఏదైనా ఆశ్రయం కల్పించండి ఆశ్రయం కల్పించండి అని అడిగితే నాకు సంబంధంలేదు ఎమ్మార్వో గారికి వెళ్లి అడగండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు మాకు వేరే దిక్కులేక కారుతున్న ఇళ్లలో తడుచుకుంటూ తడదాచుకున్నాం ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని %ఎతీశీ% కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహార నివేదిక తయారుచేయండి : కర్రోతు బంగార్రాజు



విశాలాంధ్ర-భోగాపురం : తుఫాన్ లో నష్టపోయిన ప్రతి రైతు పరిహారం పొందేలా నివేదికలు త్వరగా తయారుచేయాలని మార్క్ఫెడ్ చైర్మన్ బంగార్రాజు అధికారులను ఆదేశించారు. మండలంలో నందిగాం గ్రామంలో మోంతా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనే మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది మండలం లో రైతులు అందరి పొలాలను సందర్శించాలన్నారు. అదే విధంగా మండలంలోని అన్నిగ్రామాలలో పంట నష్టం అంచనా వేసి నివేదిక తయారు చేయలని వ్యవసాయశాఖ సిబ్బంది ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.హైమావతి,మండల టిడిపి అధ్యక్షులు. కరోతు సత్యన్నారాయణ,ఎ.ఎం.సి, డైరెక్టరు,గరి వెంకటరమణ,నందిగాం సర్పంచ్ గరి మురళి,ముంజేరు ఎంపీటీసీ పిడుగు సత్యం., ఉద్యాన సహాయకులు, కె.సిరిచందన, రైతులు పాల్గొన్నారు.

బిల్లలవలసలో పారిశుధ్యం షురూ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో బిల్ల వలస గ్రామంలో సర్పంచ్ తిరుమల రాజు పాపయ్యమ్మ ఆధ్వర్యంలో కాలువ పూడికతీతలతో పాటు, కాలువల్లో బ్లీచింగ్ జల్లారు. తుఫాన్ అనంతరము గ్రామంలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ఈ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి వర్మ రాజు, కార్యదర్శి భాష, పారిశుద్ధ్య కార్మికుడు బంగారి పాల్గొన్నారు.

నష్ట పోయిన అన్నదాతలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే కోండ్రు

విశాలాంధ్ర -వంగర: మండలం లో కొండచాకరాపల్లి,కొప్పర గ్రామాల కు రక్షణ గోడ నిర్మాణం నకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేయనున్నట్లు రాజాం శాసనసభ్యులు కోండ్రు మురళీమోహన్ రావు రైతులకు హామీ ఇచ్చారు.గురువారంనాడు ఆయన తుఫాన్ వర్షాల ప్రభావంనకు ముంపునకు గురైన కొండ చాకరాపల్లి,కొప్పర గ్రామాలలో పంటపొలాలను కొప్పర నుండి కొండచాకరాపల్లి వరకు ట్రాక్టర్ తో వెళ్ళి పూర్తిగా నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు.సువర్ణముఖి - వేగవతి నది పొంగి పొర్లి వందల ఎకరాలు పంటనష్టంజరుగుతుందని,కొప్పర నుంచి కొండచాకరాపల్లికి రక్షణ గోడ నిర్మించాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ ను రైతులు మొరపెట్టుకున్నారు.దీనిపై స్పంచిన ఎమ్మెల్యే కోండ్రు ఈసమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు.అనంతరం రేగిడి ఆమదాలవలస మండలం చెలికానివలస గ్రామంలో సాయన్న గెడ్డ, ఆకుల గెడ్డ పొంగడంతో పూర్తిగా నీటమునిగిన పంటపొలాలను, మోటార్ సైకిల్ పై పంటపొలాలను పరిశీలించి రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగర మాజీ ఎంపీపి,మాజీ జెడ్పీటీసీ సభ్యులుబొత్స వాసు దేవరావునాయుడు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షప్రతినిధి,రాజాం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రతినిధి లచుభుక్త కృష్ణ మూర్తి,విజయనగరం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, రాజాం టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటిమోహన్ రావు, మండల టిడిపి మాజీ అధ్యక్షుల బి త్రినాధులు పి ఎ సి ఎస్ అధ్యక్షులు బెజ్జి పురం రవిబాబు బె వ రభాస్కరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు తదితర మండల స్థాయినాయకులు తదితరులు ఎంపిడిఓ రాజారావు, మండల వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు,తదిత రులు ఆయన వెంట పాల్గొన్నారు.

తుపాన్ బాధితులను ఆదుకోలేని ప్రభుత్వ యంత్రాంగం - ప్రజా ప్రతినిధులుమౌనం

గిరి గ్రామంలో మూడు రోజులుగా నిద్రాహారాలు లేక తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు ఎస్.కోట మండలంలోని కొండమల్లిపూడి గిరిజన గ్రామంలో ప్రజల జీవితాలను స్తంభింపజేశాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన గ్రామంలోని గిరిజనుల మట్టి ఇళ్లు కూలిపోగా, కొన్ని ఇళ్లలో నీరు నిండిపోయింది. వర్షపు నీటిలో ఇరుక్కుపోయిన ప్రజలు చంటి పిల్లలు, ముసలివారితో కలిసి నిద్రాహారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు."పడుకోవడానికి చోటు లేక కూర్చుని రాత్రులు గడుపుతున్నాం" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కొండమల్లిపూడి గ్రామంలో 20 కుటుంబాలు సుమారు వందమంది జనాభా ఉన్నారు. నాలుగు రోజులుగా వర్షం ఆగకపోవడంతో సహాయం అందక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కొత్తూరు వీఆర్వో నూర్ చోట "పాత ఫారెస్ట్ భవనంలో పునరావాసం ఏర్పాటు చేశాం, అక్కడకి వెళ్లండి" అని సూచించినట్లు గిరిజనులు తెలిపారు. అయితే ఆ భవనం కూడా శిథిలావస్థలో ఉండటంతో, లోపల నీరు చేరి, ఉండటానికి వీలు లేకపోవడంతో గిరిజనులు "ఎక్కడ ఉండాలి?" అని వేదన వ్యక్తం చేస్తున్నారు."మా గిరిజనులపై వీఆర్వో చులకన భావనతో వ్యవహరిస్తున్నారు. ఏదైనా అడిగితే 'ఎమ్మార్వోకు చెప్పండి' అని అంటున్నారు" అని గ్రామస్థులు ఆరోపించారు.మా గిరిజనులుకు ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి నిత్యవసర వస్తువులు, ఆహారం అందించాలనీ, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, పోడు సాగు భూముల్లో పంట నష్టపరిహారం ఇవ్వాలని కొండమల్లిపూడి గ్రామస్తులు డిమాండ్ చేశారు.

విద్య దశ నుండే న్యాయ చట్టాల పైన విద్యార్థినిలు అవగాహన పెంపొందించుకోవాలి

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం రోహిణీరావు

విశాలాంధ్ర-బొబ్బిలి : విద్యా దశనుండే విద్యార్థినిలు భారత న్యాయ చట్టాల పైన అవగాహన పెంపొందించుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం విద్యార్థినిలకు పలు న్యాయ చట్టాల పైన అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులకు న్యాయ చట్టాల ద్వారా విధించే శిక్షలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తెలుసుకోవాలని తెలిపారు. అనంతరం స్థానిక సబ్ జైలును సందర్శించి ఖైదీలకు అందుతున్న మౌలకు వసతులు పౌష్టిక ఆహారం పైన ఆరా తీశారు. వివిధ కేసుల్లో సబ్ జైల్లో బెయిల్ లేకుండా ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయము మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ ద్వారా అందించబడుతుందని అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జాన్ హెన్రీ వర్ధంతి వేడుకలు



విశాలాంధ్ర-రాజాం: రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీ డ్యునాంట్ వర్ధంతి సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ప్రపంచంలో అన్ని దేశాలలో వివిధ రంగాల్లో అనేక సేవలు రక్త దానం నేత్ర దానం అవయవ దానం పర్యావరణ పరిరక్షణ లాంటి ఎన్నో సేవలు అందిస్తున్న గొప్ప సేవా సంస్థ రెడ్ క్రాస్ సంస్థ. కొన్ని కోట్ల మందికి ప్రాణ దానం చేస్తున్న సంస్థను ప్రారంభించిన మహనీయుడిని జాన్ హెన్రీ డ్యునాంట్ స్మరించుకుంటూ ఎంపీడీఓ జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, మక్క అప్పలనాయుడు, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ, గట్టి పాపారావు, పందూరి వేణుగోపాల రావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నమెంట్ ఐ.టి.ఐ కాలేజీ లో జాబ్ మేళా

30 మందికి ఉద్యోగాలకు ఎంపిక



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో స్థానిక గవర్నమెంట్ ఐ.టి.ఐ కాలేజీ లో జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ టి . వి గిరి మాట్లాడుతూ , చదువుకున్న నిరుద్యోగ యువతకు జర్మన్ భాష నేర్పించి జర్మన్ లో ఉద్యోగం కల్పింటకు జాబ్ డ్రైవ్ నిర్వహించటం జరిగిందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవాలన్నారు. ఈ జాబ్ మేళ కి 80 మందిఅభ్యర్థులు హాజరయ్యారని , వీరిలో 30 మందికి ఉద్యోగాల కు ఎంపికయ్యారన్నారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు 4 నెలలు జర్మన్ భాష మీద శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం జర్మనీ కి పంపించటం జరుగుతుందని తెలియచేశారు. జీతం నెలకు 2,52,658/- నుండి 3,24,846/- వరకు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ యొక్క జాబ్ మేళాలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు జిల్లా నైపుణ్యభివృద్ధి అధికారి జి . ప్రశాంత్ కుమార్ ఇటువంటి అవకాశాలు వచ్చేటప్పుడు ఉద్యోగాలు పొందేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న కాలంలో జరిగే ప్రతి జాబ్ మేళాలో నిరుద్యోగ యువత పాల్గొని ఉద్యోగాలు పొందెందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు వాయిదా

కొత్త తేదీలు త్వరలో ప్రకటన

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: శ్రీయుత వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ & చైర్మన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలో జరగవలసిన ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల (పురుషులు మరియు మహిళల) జిల్లా స్థాయి ఎంపిక పోటీలు వాయిదా వేయబడ్డాయి. మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా భద్రతా పరమైన దృష్ట్యా ఈ పోటీలు నిరవధికంగా వాయిదా వేయడం జరిగినది. తదుపరి తేదీలు మరియు రాష్ట్రస్థాయి పోటీల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించబడనున్నాయని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్. వేంకటేశ్వరరావు తెలిపారు. క్రీడాకారులు మరియు అధికారులు తాజా సమాచారానికి జిల్లా క్రీడా అభివృద్ధి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

భూసేకరణకు సంబంధించిన పనులను వేగవంతం కావాలి

జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో పలు ప్రాజెక్టుల కోసం చేపడుతున్న భూసేకరణ కు సంబంధించిన అవార్డ్ పాస్ చేయడం, సంబంధిత అధికారులకు లేఖలు రాయడం, ఇతర ప్రాసెస్సింగ్ వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం ముగ్గురు ఆర్.డి.ఓ లతో కలెక్టర్ తన ఛాంబర్లో భూసేకరణ పై సమీక్షించారు. జాతీయ రహదారుల, భోగాపురం ఎయిర్పోర్ట్, ట్రైబల్ యూనివర్సిటీ, రెల్లి వద్ద గ్రేహౌండ్స్ కి కేటాయించిన భూమి, ఎం.ఎస్.ఎం.ఈ ల కోసం భూసేకరణ, మురునీరు ట్రీట్మెంట్ ప్లాంట్ కు, రైతు బజార్, విజయనగరం డిగ్రీ కళాశాలకు వేణుగోపాపురం వద్ద కేటాయించిన భూమి, నియోజకవర్గ పరిధిలో ఒక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తదితర ప్రాజెక్టుల కు భూసేకరణ సమస్యల పై ఆర్.డి.ఓ ల తో చర్చించినారు. టైం లైన్ లోపల పనులు పూర్తి కావాలని, పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించుకోవాలని అదేశించారు. ఈ సమావేశంలో జె.సి సేదు మాధవన్, ఆర్.డి.ఓ లు కీర్తి, రామ్మోహన్, సత్యవాణి , సూపరింటెండెంట్ లు గోవింద, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్!

ప్రజా ధన దుర్వినియోగ వివాదంలో జడ్ పీ చైర్మన్

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలోని స్వర్గధామం నిర్మాణ పనులపై సర్పంచుల ఫిర్యాదుల మేరకు విచారణ పూర్తయ్యే వరకు ప్రారంభోత్సవం నిలిపివేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ముందుగానే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ ఆదేశాలను పట్టించుకోకుండా, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్‌రావు వైకాపా నేతలతో కలిసి స్వర్గధామం ప్రారంభించారు. రూ. 60.57 లక్షల నిధులతో నిర్మించిన ఈ పనుల్లో అవకతవకలు జరిగాయని సర్పంచులు ఆరోపించారు. సాధారణంగా రూ. 5 నుంచి 10 లక్షల వ్యయంతో పూర్తయ్యే పనులకు 60 లక్షల వ్యయం చూపించడం ప్రజా ధన దుర్వినియోగమని పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ నిధులను ప్రజా సంక్షేమం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తీవ్రంగా విమర్శించారు.రుషికొండ ప్యాలెస్ అవినీతి తరహాలో ఇదీ మరో ఉదాహరణగా మారిందని ఆమె అన్నారు. "రూ. 500 కోట్ల రుషికొండ ప్యాలెస్ అవినీతి మాదిరిగానే, రూ. 60.57 లక్షల స్వర్గధామం అవకతవక కూడా వైకాపా పాలనలో అవినీతి ప్రతీకగా నిలుస్తోంది," అని ఎమ్మెల్యే అన్నారు.ఈ ఘటనపై తక్షణ విచారణ జరిపి ప్రజా ధనాన్ని వృథా చేసిన అధికారులపై, నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా అధికారులను కోరారు.

తుఫానుకు దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-గుర్ల: ఇటీవల సంభవించిన తుఫాను కారణంగా గుర్ల మండలం, పాలవలస గ్రామానికి చెందిన రైతు గేదెలు అప్పలనాయుడు బొప్పాయి తోట పూర్తిగా నేలకొరిగింది. ఈ విషయం తెలుసుకున్న .తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యువ నాయకులు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి, దెబ్బతిన్న పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు అప్పలనాయుడు తన ఆవేదనను మల్లిక్ నాయుడుకి విన్నవించుకున్నారు. ఎంతో కష్టపడి, పెట్టుబడి పెట్టి పెంచిన పంట చేతికొచ్చే సమయానికి తుఫాను రూపంలో కళ్లముందే నేలమట్టం అయిందని కన్నీటి పర్యంతమయ్యారఈ విషయంపై అధికారులతో మాట్లాడి, అప్పలనాయుడుకి న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. రైతులకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెన్నె సన్యాసినాయుడు, సొసైటీ చైర్మన్ ను, కిరణ్ బాబు, అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షులు మహేశ్వరరావు, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రెల్లివలసలో శ్మశాన వాటిక ప్రారంభం

విశాలాంధ్ర - పూసపాటిరేగ : మండలంలోని రెల్లి వలస గ్రామం లో మండల పరిషత్ నిధులతో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించిన స్మశాన వాటికను గురువారం ఉదయం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఆధునిక సదుపాయాలతో సౌకర్యవంతంగా నిర్మించిన ఈ స్మశాన వాటిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎంపీపీ మహంతి కళ్యాణి మాట్లాడుతూ రెల్లివలస, చల్లవాని తోట పరిసర ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వైసీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇటువంటి స్మశాన వాటికలు తప్పనిసరిగా నిర్మించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడి సత్యనారాయణ, ఎస్. సత్యనారాయణ రాజు, మహంతి జనార్దన్ రావు, మహంతి శ్రీనివాసరావు, ఈఓ పిఆర్డీ, సర్పంచులు, ఎంపీటీసీలు, రెల్లివలస ప్రజలు పాల్గొన్నారు.

అవినీతి జాడ్యాన్ని తరిమికొట్టి సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి...



విశాలాంధ్ర-విజయనగరం :అవినీతి జాడ్యాన్ని తరిమికొట్టి సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పల్లి నల్లనయ్య, ఏసీబీ డీఎస్పి ఎన్. రమ్య పిలుపునిచ్చారు.అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ మరియు నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ సమాజంలో అవినీతి లేకుండా నిజాయితీగా సేవలు అందించిన నాడే ఏ అధికారికైనా, ఉద్యోగి కైనా పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. అవినీతి అనేది ఓ వ్యాధి వంటిదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా తీసుకున్న జీతంతో, అవినీతి రహితంగా సేవలు చేసిన వారి జీవితం ఎంతో సాఫీగా, ఆనందంగా, మానసిక ప్రశాంతతతో సాగుతుందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనలో భాగంగా అవినీతి నిరోధక సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. లంచం అనేది పాపంగా, దుర్మార్గంగా పరిగణించాలన్నారు. అవినీతి మహమ్మారిని సమాజం నుండి తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్పి రమ్య మాట్లాడుతూ అవినీతితో ఏ ఒకరూ మనశ్శాంతిగా ఉండలేరన్నారు. లంచం, అవినీతికి పాల్పడిన వారు ఏసీబీ నుండి తప్పించుకోలేరన్న విషయాన్ని కూడా గమనించాలన్నారు. పూర్తి ఆధారాలతో మాత్రమే ఏసీబీ కేసును నమోదు చేస్తుందని అన్నారు. మనిషికి ఉన్న అత్యాశే అవినీతికి ప్రధాన కారణమని అన్నారు. లంచంతో పట్టుబడితే శిక్ష పడడమే కాకుండా సమాజంలో తలెత్తుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం అంటే మన పాపాన్ని మనమే పెంచుకుపోతున్నట్లు అర్థమని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఏసీబీ సీఐ మహేశ్వర రావు, నగరపాలక సంస్థ ఉద్యోగులు, వీధి శాఖల ప్రతినిధులు, అవినీతి నిరోధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.